సాక్షి
పెద్దపల్లి



ఖాకీ కల సాకారం

పేదింటి బిడ్డలు పట్టుదలతో కష్టపడి చదివి ఖాకీ కొలువుకొట్టారు. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ చదివించగా, వారి కష్టాన్ని కళ్లారా చూసిన యువకులు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం పోలీస్ ఉద్యోగం సాధించి వారి కల సాకారం చేసుకున్నారు. - వివరాలు 8లో

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

పెద్దపల్లి అభివృద్ధే ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం రూ.5.81కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు కమిషనర్ వెంకటేశ్, కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు తూముల సుభాష్‌రావు, బూతగడ్డ సంపత్ తదితరులున్నారు.

పరీక్షల నిర్వహణలో సర్కార్ విఫలం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పబ్లిక్ సర్వీస్ పరీక్షలు నిర్వహించడంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఆరోపించారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రశ్నాపత్రాలను లీక్ చేసి పరీక్షల రద్దు కారకులైన బోర్డు చైర్మన్, సెక్రటరీ, బాధ్యులైన అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. నాయకులు నాగచంద్ర, ప్రవీణ్, రిషి, సాయితేజ, అజయ్, అరవింద్, రాకేశ్, శ్రీనివాస్, ఆదిత్య, వంశీ, వివేక్, జితేందర్ నరేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మగ్గం డిజైనింగ్ నైపుణ్యతపై శిక్షణ



మెటీరియల్ అందజేస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీధర్

కమాన్‌పూర్(మంథని): మండలంలోని పేరపల్లి గ్రామంలో రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మహిళలకు మగ్గం డిజైనింగ్ నైపుణ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మగ్గం డిజైనింగ్‌పై ఆసక్తిగల మహిళా సంఘాల సభ్యులను ఎన్నుకొని వారికి మగ్గం డిజైనింగ్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పేరపల్లిలో మగ్గం డిజైనింగ్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందని, మహిళలు సద్వినియోగం చేసుకుంటు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సునీత, సర్పంచ్ తాగరి అశోక్, కేవీకే హెడ్ శ్రీనివాస్, నవ్య, ఏపీఎం శైలజకాంతి, సరస్వతి, వెంకన్న, వినోద్ పాల్గొన్నారు.

30 లక్షల చేప పిల్లలు పంపిణీ



చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తదితరులు

ఓదెల(పెద్దపల్లి): జిల్లాలో 30 లక్షల చేప పిల్లలు పంపిణీ చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి జె.భాస్కర్ పేర్కొన్నారు. గురువారం ఓదెలలో చేప పిల్లలు పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలో 1,000 చెరువులు, రెండు రిజర్వాయర్లు సుందిళ్ల, అన్నారం బ్యారేజీలలో కోటి 50లక్షల చేపపిల్లలను కలిపేందుకుగాను ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, ధర్మారం మండలాల్లో చేపపిల్లల పంపిణీ పూర్తయిందని, అధిక వర్షాపాతంతో పూర్తిస్థాయిలో కార్యక్రమం పూర్తికాలేదన్నారు. ఓదెల మండలంలో 138 చెరువులు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకన్న, ఎంపీటీసీ బొడకుంట చిన్నస్వామి, మత్స్యసంఘం అధ్యక్షుడు మంద కొమురయ్య, డైరెక్టర్ రాయిల్ల రాజేశం, ఆకుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పాయే.. దసరా వచ్చే..

- డబుల్ బెడ్రూం ఇళ్లు ఇంకెప్పుడిస్తరు?
- లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి 6 నెలలు
- నేటికీ లబ్ధిదారులకు అందని హక్కు పత్రాలు
- మరోపక్క పూర్తికాని గృహలక్ష్మి అర్హుల జాబితా
- ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఇవ్వాలంటున్న లబ్ధిదారులు



ఈ ఫొటోలో ఉన్నవి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కూనారం, చందాపల్లి ప్రాంతాల్లో నిర్మించిన 484 డబుల్ బెడ్రూం ఇళ్లు. రిజర్వేషన్ల ప్రతిపాదికన అర్హులను మార్చి 15న ఎంపిక చేశారు. లక్కీ డ్రాలో లబ్ధిదారులకు అదృష్టం తట్టి, 6 నెలలు గడుస్తున్నా నివాస యోగ్యానికి కావాల్సిన ప్రొసీడింగ్ కాపీలు ఇంతవరకు ఇవ్వలేదు. మరో పక్క ఇంటిస్థలం ఉండి, నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం కింద నియోజకవర్గానికి 3వేల మందిని ఎంపిక చేయాల్సి ఉండగా, వారి ఎంపిక సైతం నేటికి పూర్తికాలేదు.

త్వరలో పంపిణీ చేస్తాం



డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి పూర్తిచేసిన వెంటనే మంత్రులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో గృహ ప్రవేశాలు చేయిస్తాం. గృహలక్ష్మి పథకానికి సంబంధించి మంథనిలో పూర్తిచేశాం. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం పూర్తిచేస్తాం.

– అరుణశ్రీ, స్థానికసంస్థల అదనపు కలెక్టర్

సాక్షి, పెద్దపల్లి: ఉగాది పండుగకు గృహ ప్రవేశాలన్నారు. దసరా పండుగ దగ్గరికి వచ్చినా నేటికి కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు కాలుమోపలేదు. మరో వారం రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. దీంతో సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలోనే ఉంటూ అద్దెలు భరిస్తూ ఇబ్బందులు పడుతున్నా నిరుపేదలు త్వరగా హక్కుపత్రాలు ఇస్తే బాగుంటుందని కోరుతున్నారు. ఎన్నికల కోడ్ వస్తే మరింత ఆలస్యం కావడంతో పాటు, వచ్చే ప్రభుత్వంలో పాలసీ ఎలా ఉంటుందోనని మదనపడుతున్నారు.

గత మార్చి 15న ఎంపిక

జిల్లాలోని పెద్దపల్లి జిల్లాకేంద్రంలో 484 మందిని, రామగుండంలో 660 మందిని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను మార్చి 15న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఆ నెలలోనే ఉగాది పండుగ సందర్భంగా నూతన గృహ ప్రవేశాలు చేయిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పారు. 6 నెలలు గడుస్తున్నా డబుల్ బెడ్రూం ఇళ్ల హక్కుపత్రాలు అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికెప్పుడో..

ఇళ్లు లేక స్థలం ఉండి నిర్మించుకునే పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం తీసుకొచ్చింది. నియోజకవర్గానికి మొదటి విడత కింద 3వేల చొప్పున కేటాయిస్తూ, దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లాకు 8,475 ఇళ్లు కేటాయించగా, 33,816 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన యంత్రాంగం అర్హులుగా 25,040 మందిని గుర్తించింది. కాగా కేవలం మంథని నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు సంబంధించిన 454 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. పెద్దపల్లి, రామగుండంలో ఐదుగురు చొప్పున కేటీఆర్‌తో ఇటీవల జరిగిన సభలో అందజేశారు. మిగతా అర్హుల జాబితా తయారు చేయడంలో ఎమ్మెల్యేలు జాప్యం చేస్తున్నట్లు లబ్ధిదారులు మండిపడుతున్నారు.

మంథనిలో పూర్తి..

మంథనిలో 92 డబుల్ బెడ్రూం ఇళ్లకు 72మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, హక్కుపత్రాలు ఇవ్వటంతో వారందరూ అందులో నివాసం ఉంటున్నారు. మరో పక్క గృహలక్ష్మి పథకం కింద 454 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ప్రొసీడింగ్ కాపీలు సైతం అందించారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు చొరవతో సంక్షేమ పథకాల ఫలాలు త్వరితగతిన లబ్ధిదారులకు అందుతున్నాయి.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు హర్షిత



ప్రాజెక్టుతో హర్షిత

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన డి.హర్షిత ఎంపికైంది. గత జనవరిలో నిర్మల్ పట్టణంలో రాష్ట్రస్థాయి పోటీల్లో అంటీ పాండమిక్ వాటర్ బాటిల్ ప్రాజెక్టును ప్రదర్శించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 11 వరకు ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు గురువారం బయలుదేరారు. ఈసందర్భంగా డీఈవో మాధవి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న మరమ్మతులు

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో వార్షిక మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గత నెల 26న విద్యుత్ కేంద్రాన్ని థర్మల్, ప్రాజెక్ట్సు, సివిల్, హైడల్ విభాగాలకు చెందిన డైరెక్టర్ల బృందం సందర్శించిన విషయం తెలిసిందే. కాగా బీ–థర్మల్‌ను గత నెల 12న మరమ్మతుల నిమిత్తం షట్ చేసిన అధికారులు అక్టోబర్ మొదటి వారంలో విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకురానున్నట్లు డైరెక్టర్ల బృందం సందర్శించిన సమయంలో తెలిపింది. కాగా గడువు సమీపిస్తున్నా ఇంకా చేపట్టాల్సిన పనులు చాలా ఉన్నాయని తెలిసింది. అలాగే విద్యుత్ కేంద్రం రెనోవేషన్ అండ్ మోడ్రనైజేషన్ (ఆర్అండ్ఎం)కు సరిపడ నిధులు కేటాయించి పనులు చేస్తేనే కొన్నేళ్ల పాటు సాంకేతిక సమస్యలు ఎదురవకుండా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, ప్రస్తుతం వార్షిక మరమ్మతు పనులతో అంతగా ప్రయోజనం ఉండదని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

తొమ్మిదేళ్లలో రూ.40 వేల కోట్ల వ్యాపారం

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



సింగిల్ విండో గోదాం ప్రారంభిస్తున్న చైర్మన్ రవీందర్‌రావు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తొమ్మిదేళ్ల కాలంలో వ్యవసాయ పరపతి సహకార సంఘం రూ.40 వేల కోట్ల వ్యాపారం చేసిందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో రూ.38 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంను గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేటు బ్యాంకులకు దీటుగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని వివరించారు. అనేక పథకాలు అమలు చేస్తూ రైతుల పక్షపాతిగా సీఎం కేసీఆర్ నిలిచారని ఎమ్మెల్యే అన్నారు. దివంగత నేత, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే కాల్వ రాంచంద్రారెడ్డి తనయులు రాజప్రసాద్‌రెడ్డి (సాక్షి మీడియా సంస్థల ఏడీవీటీ డైరెక్టర్), వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి ఆరుగుంటల భూమిని విరాళంగా అందించారని ఈసందర్భంగా వారికి ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు కాల్వ రాంచంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ కామిడి సంధ్య, సర్పంచు ఆడెపు శ్రీదేవి, నాబార్డు ఏజీఎం జయప్రకాశ్, కేడీసీసీబీ మేనేజర్ కరుణశ్రీ, విండో చైర్మన్లు పురుషోత్తం, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాదమే మార్పునకు నిదర్శనం

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



ముగింపు సభలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: ప్రజలను కలిసేందుకు పాదయాత్రగా వారి వద్దకు వెళ్తే ఆశీర్వదించి అక్కున చేర్చుకున్నారని, ప్రజల్లో మార్పునకు అదే నిదర్శనమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని నియోజకవర్గంలో సుమారు 311 కిలోమీటర్ల మేర చేపట్టిన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర ముగింపు సందర్భంగా పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సభలో ఎంపీ వెంకటేష్‌నేత, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా అనేక గ్రామాల్లోని ప్రజల్లో వచ్చిన చైతన్యాన్ని చూసిన కాంగ్రెసోళ్లు ఓడిపోతామని ఫిక్స్ అయ్యారని భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. కాంగ్రెస్ నాయకులకు కనువిప్పు కలిగేలా ప్రతి బీఆర్ఎస్ సైనికుడు కష్టపడి పనిచేసి మధన్నను గెలిపించుకోవాలని కోరారు. అధికారం కోసం కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే గుంట నక్కల్లా ఎదురుచూస్తున్నారని ఎంపీ వెంకటేశ్‌నేత ఎద్దేవా చేశారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు, దళిత, గిరిజనులకు అన్యాయమే జరిగిందని, నాడు ఉపాధి లేక ఎంతోమంది వలసలు పోయారన్నారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుట్రలకు చరమగీతం పాడాలి


కమాన్‌పూర్(మంథని): తనపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు చరమగీతం పాడాలని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర గురువారం మండల కేంద్రంలోని ఆదివరహస్వామి ఆలయం నుంచి జూలపల్లి మీదుగా కొనసాగింది. మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని జెడ్పీ చైర్మన్ మధు అన్నారు. ప్రజా ఆశీర్వాద పాదయాత్ర గురువారం యైటింక్లయిన్‌కాలనీ, వెంకట్రావుపల్లికి చేరుకోగా బీఆర్ఎస్ శ్రేణులు, ఆర్జీ–2 ఏరియా టీబీజీకేఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అలాగే రామగిరి మండలం చందనాపూర్‌లో అంబేద్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు చైర్మన్ నివాళులర్పించారు. అనంతరం వారి విగ్రహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ దాసరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్(రామగుండం): రామగుండం అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతున్నామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం రాత్రి ఐదో డివిజన్ మల్కాపూర్ రోడ్‌లో పట్టణ ప్రగతి నిధులు రూ.1.30 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణితో కలిసి భూమిపూజ చేశారు. రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధికి కేరాఫ్ చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.

ట్రై సైకిళ్ల అందజేత

గోదావరిఖని(రామగుండం): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం 60 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ట్రై సైకిళ్లను అందజేశారు. దివ్యాంగులు సమాజంలో గౌరవంగా జీవించాలని రూ.4వేలు పింఛన్ ఇస్తూ వారికి అండగా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారన్నారు. అలాగే తెలంగాణా క్రీడా ప్రాంగణాల స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, జెడ్పీటీసీ ఆముల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘గుర్తింపు’ టెన్షన్

- నేడు, రేపు నామినేషన్ల పర్వం
- నామినేషన్ వేస్తామంటున్న ఏఐటీయూసీ, బీఎంఎస్
- ఎన్నికలకు దూరమంటున్న యాజమాన్యం, 12 సంఘాలు
- కోర్టు డైరెక్షన్ కాపీ రాలేదంటున్న కార్మిక శాఖ



మధ్యాహ్నం వరకు చూస్తాం

సింగరేణి గుర్తింపు ఎన్నికలపై కోర్టు ఆదేశాల మేరకు ముందుకు సాగుతాం. గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈనెల 6,7వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఫుల్‌బెంచ్‌లో జరిగిన వాదోపవాదాల తర్వాత కోర్టు డైరెక్షన్ కాపీ మాకు అందలేదు. కాపీ వచ్చిన తర్వాత నిర్ణయం ఉంటుంది. దీనికోసం మధ్యాహ్నం వరకు ఎదురు చూస్తాం.

– శ్రీనివాసులు, డిప్యూటీ సీఎల్‌సీ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు ఎన్నికలపై టెన్షన్ పెరుగుతోంది. కేంద్ర కార్మిక శాఖ ఆదేశాల మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను గత నెల 28న డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు ప్రకటించారు. తర్వాత వరుసగా కోర్టుకు సెలవులు రావడంతో యాజమాన్యం కోర్టుకు వెళ్లడంలో జాప్యం జరిగింది. గురువారం కోర్టులో ఎన్నికల వాయిదాపై జరిగిన వాదోపవాదాల నేపథ్యంలో ఈనెల 11వ తేదీకి వాయిదా పడింది. అయితే వాదోపవాదాలు వాయిదాపడ్డాయా? లేక ఎన్నికల ప్రక్రియ 11వరకు వాయిదా వేయమన్నారా? అనేదానిపై క్లారిటీ రాలేదు. కార్మిక శాఖ మాత్రం గత ఉత్తర్వుల ప్రకారం ముందుకు వెళ్లాలని నిర్ణయించినా, గురువారం జరిగిన వాదోపవాదాల కాపీ తమకు అందలేదని చెబుతోంది. ఈక్రమంలో శుక్రవారం నుంచి గుర్తింపు ఎన్నికల కోసం నామినేషన్ల స్వీకరణ జరగాల్సి ఉంది. అయితే కోర్టు మొదటి డైరెక్షన్ మేరకు నామినేషన్లు సీకరిస్తారా? లేదా ప్రస్తుత ఫుల్‌బెంచ్‌లో జరుగుతున్న నిర్ణయం మేరకు వాయిదా వేస్తారా అనేదానిపై క్లారిటీ లేకుండా పోయింది. ఎన్నికలు వద్దని యాజమాన్యం, గత గుర్తింపు సంఘం, 3 జాతీయ సంఘాలతో పాటు మిగతా 7 సంఘాలు చెబుతున్నాయి. బీఎంఎస్, ఏఐటీయూసీ మాత్రం నామినేషన్లు వేస్తామని, నామినేషన్ల స్వీకరణ లేకుంటే కోర్టు ఉత్తర్వులు కార్మిక శాఖ ధిక్కరించినట్లేనని చెబుతోంది.

రేపు నామినేషన్ వేస్తాం: రెండు సంఘాలు

కోర్టు ఆదేశాల మేరకు కార్మిక శాఖ ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 6,7తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ ఉంది. ఈనామినేషన్లలో పాల్గొంటాం. తమ యూనియన్ తరపున నామినేషన్ వేస్తాం. నామినేషన్లు స్వీకరించక పోతే కోర్టు ఉత్తర్వులు ధిక్కరించినట్లే.

రెండే యూనియన్లు నామినేషన్ వేస్తే..

సింగరేణిలో 14 యూనియన్లు ఉండగా, రెండు యూనియన్లు నామినేషన్ వేసి మిగితావి వేయకుంటే ఏమిటనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. రెండు యూనియన్ల నామినేషన్లు స్వీకరిస్తే మిగతా యూనియన్లు పోటీ చేసే అవకాశం కోల్పోతాయి. ఎన్నికలు వాయిదా పడితే ఫర్వాలేదు. కానీ ఇదే షెడ్యూల్ ప్రకారం జరిగితే నామినేషన్ వేసిన రెండు యూనియన్లకు లాభం జరిగే అవకాశం ఉంది. ఈక్రమంలో మిగతా యూనియన్లు కోర్టు తీర్పు, యాజమాన్యం నిర్ణయం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి.

స్థలాల లీజుపై దుమారం

- వాడీవేడిగా మున్సిపల్ సాధారణ సమావేశం
- 47 అంశాలను ప్రవేశపెట్టిన మేయర్
- ఎజెండాలో రెండు అంశాలు తిరస్కరణ





మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్, సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన 14వ సాధారణ సమావేశంలో మున్సిపల్ స్థలాల లీజు అంశంపై దుమారం లేసింది. అలాగే రామగుండం నగరపాలక సంస్థ పేరులో జనగామ పేరును కూడా బ్రాకెట్‌లో పెట్టాలనే అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. మొత్తం 47 అంశాలను మేయర్ ప్రవేశపెట్టారు. ఇందులో రూ.20లక్షలతో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు చెందిన ఒక అంశాన్ని పక్కకుపెట్టగా, జనగామ మున్సిపల్ కార్పొరేషన్‌గా పేరును చేర్చాలనే అంశంతోపాటు మున్సిపల్ స్థలాల లీజు అంశాన్ని సభ్యులు తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. × జనగామ వద్దు.. రామగుండమే ముద్దు॥ అంటూ ప్లకార్డు పట్టుకొని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత నిరసన తెలిపారు. కాంగ్రెస్ కార్పొరేటర్ కొలిపాక సుజాత, పలువురు కార్పొరేటర్లు కూడా అభ్యంతరం తెలిపారు. రామగుండం పేరును తొలగించడం లేదని, జనగామ పేరును బ్రాకెట్‌లో జత చేయాలని మాత్రమే కోరుతున్నామని 8, 9వ డివిజన్ కార్పొరేటర్లు ధాతు శ్రీనివాస్, జనగామ కవితాసరోజినీ అన్నారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడం నగరపాలక సంస్థ పరిధిలోనిది కాదని మేయర్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తెలిపారు. కార్పొరేటర్ల సూచనల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఏకాభిప్రాయంతో తగు చర్య తీసుకుందామని మేయర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఖాళీ స్థలాల లీజు విషయంలో కూడా పలువురు కార్పొరేటర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనతో బీఆర్ఎస్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు.

పలు అంశాలకు ఆమోదం

ఎన్నికల నియామవళితో అంతరాయం ఏర్పడకుండా 50 డివిజన్‌లలో కార్పొరేటర్లు సూచించిన ప్రకారం చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అభివృద్ధి పనుల టెండర్లు పొంది పనులు చేయని ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు తర్వాత టెండర్లలో పాల్గొనకుండా అనర్హత విధించాలనే తీర్మానాన్ని ఆమోదించారు. రానున్న బతుకమ్మ పండుగ సందర్భంగా అద్దె ప్రాతిపదికన ఆయా డివిజన్లలో ఎల్ఈడీ లైట్లు, సిరీస్ బల్బుల ఏర్పాటుకు రూ.25 లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్నం: మేయర్

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రామగుండం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరాన్ని మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుంటానని ప్రకటించడంపై కౌన్సిల్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, ఎస్ఈ చిన్నరావు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ వేస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి గుర్తింపు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 7 వరకు నామినేషన్ వేయని సంఘాలు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లేదన్నారు. కావున ఎన్నికల ప్రక్రియపై కొన్ని కార్మిక సంఘాలు చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు.

నేటి నుంచి ప్రజాదీవెన యాత్ర

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): ప్రజాదీవెన యాత్ర శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన ఆరు పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ప్రజాదీవెన యాత్ర కొనసాగుతుందన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు పాదయాత్ర చేపడుతున్నామన్నారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 నుంచి పారంభమయ్యే పాదయాత్ర నాలుగు డివిజన్ల చొప్పున కొనసాగుతుందన్నారు. యాత్రలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేషనల్ అవార్డుకు అశ్రిత


అశ్రిత

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ వెంగళ లక్ష్మణ్ కుమార్తె వెంగళ అశ్రిత నేషనల్ కళారత్న అవార్డుకు ఎంపికైనట్లు జాతీయ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. 15న ఢిల్లీలో అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపిక


ఆహ్వానపత్రం స్వీకరిస్తున్న సురేందర్

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కొత్తూరుకు చెందిన అలయన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్‌గౌడ్ బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యాడు. గురువారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్ అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆహ్వానపత్రాన్ని జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ అందజేశారు. 15న ఢిల్లీలో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

గోదావరిఖని(రామగుండం): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు అడిషనల్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ టి.ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన నంది వెంకటేశ్, చలిమడుగు నాగిరెడ్డిలను గురువారం గోదావరిఖని అడిషనల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, రెండోసారి అధికంగా మద్యం తాగి వాహనం నడిపించినందుకు వెంకటేశ్‌కు ఐదురోజులు, నాగిరెడ్డికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

మంథని: మంథని మండలం నాగారం గ్రామంలో కోండ్ర సతీశ్ ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడడంతో గాయపడ్డాడు. వెన్నెముక భాగంలో బలమైన గాయం కావడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామశివారు రైస్‌మిల్లు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గురువారం రైతు నక్క మల్లయ్యకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. సర్పంచ్ బాదరవేణి స్వామి సంబంధిత మండల ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందజేయాలని కోరారు.

నేటి నుంచి ఈ పంచాయతీ ఆపరేటర్ల సమ్మె

రామగుండం: తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తున్నట్లు ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు క్యాంపు కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. జిల్లావ్యాప్తంగా 266 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 39 ఈ గ్రామ పంచాయతీలున్నాయి. జిల్లా స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ప్రాజెక్టు మేనేజర్లకు పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ పంచాయతీ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్లకు చెల్లించే పే స్కేల్ అమలు చేయాలని తదితర అంశాలను ఎమ్మెల్యేకు అందజేసిన సమ్మె నోటీసులో పేర్కొన్నామని తెలిపారు.

ఖాకీ కల సాకారం

- పట్టుదలతో కొలువుకొట్టిన పేదింటి బిడ్డలు
- పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన యువత



ముత్తారం(మంథని): పేదింటి బిడ్డలు పట్టుదలతో కష్టపడి చదివి ఖాకీ కొలువుకొట్టారు. ముత్తారం మండలం పారుపల్లి, మచ్చుపేట, ధర్యపూర్, ముత్తారం, కేశనపల్లి గ్రామాలకు చెందిన పేద కుటుంబాల యువతి, యువకులు పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ చదివించగా, వారి కష్టాన్ని కళ్లారా చూసిన యువకులు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం పోలీస్ ఉద్యోగం సాధించారు.

చిన్నప్పుడే నాన్న చనిపోయాడు



మాది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు జక్కులు, లక్ష్మి. నాల్గో తరగతిలో నాన్న గుడుంబాకు బానిసై చనిపోయాడు. అప్పటి నుంచి అమ్మ కూలీ పనిచేస్తూ డిగ్రీ వరకు చదివించింది. నాన్న చనిపోయాక కుటుంబ పోషణ, నా చదువుకు అమ్మ పడిన కష్టాన్ని కళ్లారా చూశా. ఈ పరిస్థితి ఎవరికీ రావొద్దని, పోలీస్ కావాలని కోరిక బలపడింది. పోలీస్ అయితే గుడుంబా నిర్మూలన చేయొచ్చని ఆ ఉద్యోగానికి ప్రిపేరయ్యా. మంథనిలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌లో ఇచ్చిన శిక్షణతో ఈవెంట్స్, రాత పరీక్షకు సన్నద్ధం అయ్యాను. సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. పోలీస్ ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. ఎస్సై కావడం నా లక్ష్యం.

– తల్లితో మేకల అనూష, పారుపల్లి, ముత్తారం

ఎనిమిదేళ్లుగా సాధన..



అమ్మానాన్న నర్సయ్య, నర్సమ్మ కూలీ పని చేస్తారు. నాన్న చిన్నతనంలో చనిపోయాడు. అమ్మకు చేదోడువాదోడుగా కూలీ పనిచేసుకుంటూ చదువుకున్నా. 2015లో ఇంజినీరింగ్ పూర్తి చేశా. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రిపేరు అవుతున్నా. చాలాసార్లు తక్కువ మార్కులతో ప్రభుత్వ ఉద్యోగాలు మిస్సయ్యాను. ఇప్పుడు టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. ఉన్నత ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– కదారి ప్రవీణ్, పారుపల్లి, ముత్తారం

ఉన్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యం



అమ్మానాన్న మొండయ్య, లక్ష్మి వ్యవసాయం చేస్తారు. 2017లో బీటెక్ పూర్తి చేశా. అప్పటి నుంచి ప్రభుత్వ ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపనతో రాసిన పరీక్షలో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా. ఇంతటితో నా లక్ష్యాన్ని ఆపకుండా ఉన్నత ఉద్యోగం సాధించే వరకు పోరాడుతా.

– ముత్తే ప్రకాశ్, మచ్చుపేట, ముత్తారం

కాంపిటేషన్ పుస్తకాలు చదివా



మాది ముత్తారం. తల్లిదండ్రులు కొమురయ్య, శోభ వ్యవసాయం చేస్తారు. 2017లో బీటెక్ పూర్తి చేసిన. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని మూడేళ్ల నుంచి హైదరాబాద్‌లో ప్రిపేర్ అవుతున్నా. గ్రూపు–2, ఆర్‌ఆర్‌బీ ఉద్యోగాలకు సన్నద్ధమై అర మార్కుతో మిస్సయ్యా. యూట్యూబ్, కాంపిటేషన్ పుస్తకాలు శ్రద్ధగా చదవడంతో టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. ఏదైనా ప్రభుత్వ ఉన్నత ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– రాపెల్లి రాజాశేఖర్, ముత్తారం

ఆనందంగా ఉంది



అమ్మానాన్న మల్లయ్య, పద్మ వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. వారి శ్రమను గుర్తించిన నేను రెండేళ్ల నుంచి ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో శిక్షణ తీసుకొని చదువుకుంటున్నా. ఇంటర్ వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివా. 2021లో ఎంకాం పీజీ పూర్తి చేశా. టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. పోలీస్‌శాఖలో ఉన్నత ఉద్యోగం సాధించాలని ఉంది.

– కల్వచర్ల రాకేశ్, ధర్యపూర్, ముత్తారం

టీఎస్‌ఎస్‌పీ నుంచి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా..



రామగిరి(మంథని): మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి వికాస్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. గతంలో టీఎస్‌ఎస్‌పీ ద్వారా కానిస్టేబుల్‌గా ఎంపికై మంథనిలో విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచే కష్టపడి చదివి ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

– బొల్లంపల్లి వికాస్

పోలీస్ కార్యక్రమాలే ఇన్‌స్పైర్..



మాది వ్యవసాయం కుటుంబం. తల్లిదండ్రులు కొమురయ్య, రాజమ్మ. నలుగురు అక్కలు, నేను. 2022లో బీటెక్ పూర్తి చేశా. పదో తరగతి వరకు ముత్తారం జెడ్పీహెచ్ స్కూల్, ఇంటర్ మోడల్ కాలేజీ ధర్యాపూర్‌లో చదివే క్రమంలో ముత్తారం పోలీసులు పలుమార్లు నిర్వహించిన ఓపెన్ హౌజ్ కార్యక్రమాల్లో ఆయుధాల పనితీరు, ప్రజల రక్షణ చట్టాలు, వివిధ అంశాలపై పోలీసులు చెప్పిన మాటలు, స్పీచ్‌ల ఇన్‌స్పైర్‌తో పోలీస్ కావాలని నిర్ణయించుకున్న. రాష్ట్ర, సెంట్రల్ పోలీస్‌శాఖలో మూడుసార్లు మిస్సయ్యా. నాల్గోసారి టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికవడం ఆనందంగా ఉంది. పోలీస్‌శాఖలో ఉన్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– పాశం వెంకటేశం, కేశనపల్లి

అమ్మానాన్నల కష్టం చూడలేక..



సుల్తానాబాద్ రూరల్: చిన్నప్పటి నుంచి అమ్మానాన్నలు కష్టపడుతుండటం చూశా. డిగ్రీ వరకు చదివి కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా. పట్టుదలతో కానిస్టేబుల్(బెటాలియన్)గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– తాండ్ర శరత్, నీరుకుల్ల, సుల్తానాబాద్

అన్నయ్య ఆదర్శం..



సీబీఐ ఫింగర్ ప్రింట్ విభాగంలో ఢిల్లీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అన్న రమేశ్‌ను ఆదర్శంగా తీసుకొని పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సిద్ధమయ్యా. ఇంతకముందు ఒక్క మార్కు తేడాతో ఎస్సై జాబ్ రాలేదు. కానిస్టేబుల్‌కు ప్రిపేరై సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. వ్యవసాయ కుటుంబమైనా అన్న ప్రోత్సాహంతో జాబ్ సాధించా.

– నల్లవెల్లి తేజశ్రీ, గట్టెపల్లి, సుల్తానాబాద్

సాఫ్ట్‌వేర్ చేస్తూ..



నాన్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయ్. ఆయన కోరిక మేరకు సాఫ్ట్‌వేర్ జాబ్ వదులుకొని కానిస్టేబల్ కోసం ప్రిపేర్ అయ్యాను. మొదటి ప్రయత్నంలోనే బెటాలియాన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

– దాయికి నిఖిల్‌కుమార్, గట్టెపల్లి, సుల్తానాబాద్

ఓడినా అలసిపోకుండా..



మాది పేద కుటుంబం. కానిస్టేబుల్ కావాలనే కోరికతో రెండుసార్లు ప్రయత్నించి విఫలమై మూడోసారి ఉద్యోగం వచ్చింది. లక్ష్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి జాబ్ సాధించడంతో అమ్మానాన్నలు సంతోషంగా ఉన్నారు.

– మద్దెల విజయ్, గర్రెపల్లి, సుల్తానాబాద్

కూలీ కుటుంబం నుంచి..



పెద్దపల్లిరూరల్: అమ్మానాన్న కొమురమ్మ, వెంకటేశం. వ్యవసాయ పనులు చేస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే పట్టుదలతో ఉన్న నన్ను ప్రోత్సహించారు. ఎస్సై కావాలనే తపనతో కష్టపడ్డా. పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– మిట్టపల్లి మౌనిక, పెద్దబొంకూర్, పెద్దపల్లి

ఉద్యోగ సాధనకు అడ్డురాని పేదరికం


తల్లి పోచమ్మతో సాగర్

జూలపల్లి(పెద్దపల్లి): కడుపేదరికం ఉద్యోగ సాధనకు అడ్డురాలేదు. కష్టపడి డిగ్రీ వరకు చదివి, పట్టుదలతో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ సాగర్. సాగర్ చిన్నతనంలోనే తండ్రి రాజయ్య అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి పోచమ్మ కూలీ చేసి చదివించింది. జూలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ వరకు చదివిన సాగర్ కరీంనగర్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అలాగే చిన్నతనం నుంచి వాలీబాల్ ఆటపై అభిమానమున్న సాగర్ కఠోర సాధన చేసి జాతీయస్థాయిలో మంచి క్రీడాకారుడిగా గుర్తింపుపొందాడు.

ముగ్గురూ ప్రభుత్వ ఉద్యోగులే..


ఇద్దరు అన్నలతో శ్రీకాంత్ (మధ్యలో వ్యక్తి)

రామగిరి(మంథని): మండలంలోని లొంకకేసారం గ్రామానికి చెందిన కటికెనపల్లి ఓదమ్మ– రాజేశం దంపతులకు ముగ్గురు కుమారులు. వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ పిల్లల్ని చదివించారు. పెద్ద కుమారుడు కుమార్ ఎంబీఏ చదివి, పారా మిలిటరీలో 2015లో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం జమ్మూలో విధులు నిర్వహిస్తున్నాడు. రెండో కుమారుడు వెంకటేశ్ మైనింగ్ డిప్లొమా పూర్తి చేసి 2016లో సింగరేణి ఉద్యోగం సాధించి ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడో కుమారుడు శ్రీకాంత్ డిగ్రీ పూర్తి చేసి తండ్రికి వ్యవసాయంలో సాయంగా ఉంటూ ప్రస్తుతం టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ముగ్గురూ ఉద్యోగాలు సాధించడం పట్ల సర్పంచ్ మంజూర్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జూలపల్లి మండలం నుంచి 20 మంది..


రవికుమార్


అక్షిత


సుస్మిత

జూలపల్లి(పెద్దపల్లి): మండలకేంద్రంతో పాటు గ్రామాల నుంచి 20 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. కుమ్మరికుంట నుంచి రవికుమార్, అక్షిత, దొడ్డ సుస్మిత, అబ్బాపూర్ నుంచి గాండ్ల నరేశ్, గొరుగొంతుల సాయి, జూలపల్లి నుంచి డి.వెంకటేశ్, కాల్వ వెంకటేశ్, కొండ కళ్యాన్, సాగర్, నరేశ్‌తో పాటు మరోపది మంది ఎంపికయ్యారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ రమేశ్ తదితరులు అభినందించారు.

పాలకుర్తి మండలం నుంచి..

పాలకుర్తి(రామగుండం): మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికైనారు. బసంత్‌నగర్‌కు చెందిన సార్ల రమేశ్, కన్నాల బీసీ కాలనీకి చెందిన రమీజ్, బామ్లానాయక్‌తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ శ్యామ్‌లాల్, ఇస్లావత్ సాగర్, బదావత్ రాజేశ్, ఇస్లావత్ భరత్‌కుమార్ ఉద్యోగాలు సాధించారు. వీరంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడం విశేషం.

ప్రజలకు సేవ చేయాలని..



2016లో బెటాలియన్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం సిరిసిల్ల బెటాలియన్‌లో పని చేస్తున్నా. కానీ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రస్తుతం సివిల్ ఉద్యోగం సాధించా.

– చింతల సంపత్, గర్రెపల్లి, సుల్తానాబాద్

అమ్మానాన్నల కోరిక మేరకు..



వ్యవసాయం చేసే అమ్మానాన్నల కోరిక మేరకు కానిస్టేబుల్ కోసం ప్రయత్నించినా మొదటి దఫాలో ఉద్యోగం రాలే. అమ్మానాన్న ప్రోత్సాహంతో రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించా.

– ఆవుల ప్రదీప్, గర్రెపల్లి, సుల్తానాబాద్

ముగ్గురం ఆడపిల్లలమే..



పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్: మాది వ్యవసాయ కుటుంబం. నాన్న లచ్చయ్య, అమ్మ రాజమ్మకు ముగ్గురం ఆడపిల్లలమే. నాన్న చాలాకాలం క్రితమే చనిపోగా అమ్మ కష్టపడి చదివించింది. పదేళ్లుగా రామగుండం కమిషనరేట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నా. ఇప్పుడు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా. తల్లి కష్టపడుతూ నన్ను డిగ్రీ వరకు చదివించి ప్రోత్సహించడం వల్లే ఉద్యోగం సాధించా.

– మిట్టపల్లి రేణుక, పెద్దబొంకూర్, పెద్దపల్లి మండలం

హమాలీ కొడుకు పోలీస్..



పెద్దపల్లిరూరల్: బాగా చదివి సర్కార్ కొలువు చేయాలని నాన్న లింగయ్య, అన్న సంజీవ్ ప్రోత్సహించారు. అన్నయ్య ప్రస్తుతం కాగ్‌లో ఆడిటర్‌గా విజయవాడలో పనిచేస్తున్నాడు. నాన్న చనిపోయాక అన్నయ్య వద్దే ఉండి ఉన్నత విద్య చదివా. కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో నాన్న ఆశయం నెరవేర్చాననే సంతృప్తి కలిగింది.

– అంబటి రాణాప్రతాప్, గౌరెడ్డిపేట, పెద్దపల్లి

సంతోషంగా ఉంది



జ్యోతినగర్(రామగుండం): అమ్మానాన్న కేతిరి సమ్మయ్య, తిరుపతమ్మ. నాన్న కూలీపనులు చేస్తూ కష్టపడి నన్ను చదివిపించారు. వారి కష్టానికి ఫలితంగా నేను పోలీస్ ఉద్యోగానికి ఎంపికకావడం సంతోషంగా ఉంది.

– కేతిరి రాజ్‌కుమార్, ఎన్టీపీసీ

ఉద్యోగాల కల్పనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రావణి

రామగుండం: సాంకేతిక విద్యనభ్యసించిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వ గుర్తింపు పొందిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ 'టామ్‌కామ్' ప్రతినిధి తలశిల శ్రావణి గురువారం రామగుండం పట్టణంలోని ఐటీఐ విద్యార్థులకు ప్రాజెక్టర్ సాయంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీఐలో అభ్యసించిన ట్రేడ్‌ల ఆధారంగా విద్యార్థులు ఏ విధంగా ప్రిపేర్ కావాలి, ఏయే అంశాలపై పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం నిరుద్యోగ యువకులకు వారి విద్యార్హతలు, సీనియారిటీ ప్రాతిపదికన ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగావకాశాల కోసం 15 మంది హాజరు కాగా, వారి విద్యార్హత, వృత్తి నైపుణ్యం ఆధారంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), మారిషస్ దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు తదితర అర్హత కార్డులు, సాంకేతికపరమైన అనుమతులు పూర్తి చేసేందుకు వారం రోజుల్లో సమాచారం అందజేస్తామని, ఔత్సాహికులు హైదరాబాద్‌లోకి తమ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గత జూన్ 9న జరిగిన ఇంటర్వ్యూలలో ఎంపికైన వారికి విదేశాలకు పంపించేందుకు ఉద్యోగ శిక్షణ శిబిరం కొనసాగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు www. tom com telangana. gov. in తోపాటు సెల్ నంబర్లు 82478 38789, 78935 66493, 98496 39539 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పొలం గట్టుపై నుంచి జారిపడి వృద్ధుడు మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతల పోశాలు(90) గురువారం పొలం గట్టుపై నుంచి జారిపడి మృతిచెందాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశాలు గ్రామశివారులోని పొలం వద్దకు నీరు పెట్టేందుకు గట్టుపై నడుచుకుంటూ వెళ్తుండగా జారి పక్కనే ఉన్న నీటి కాలువలో బోర్ల పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రాజమ్మ, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుర్లున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఎఫ్‌సీఐ మాజీ కార్మికుడు..

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌కు చెందిన ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగి వేలుగూరి రామయ్య బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. రమణ పార్థివదేహానికి సోమారపు లావణ్యఅరుణ్‌కుమార్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏఐటీయూసీ పోరాటం వల్లే హక్కుల సాధన


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని(రామగుండం): ఏఐటీయూసీ పోరాటాల వల్లే కార్మికుల హక్కులు వచ్చాయని ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ గుర్తు చేశారు. గురువారం ఓసీపీ–1 సైటాఫీస్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో జరుగుతున్న ఆర్థిక దోపిడీ గత పదేళ్లలో టీబీజీకేఎస్ చేసిన అరాచకాలకు అంతం పలకాలన్నారు. యాజమాన్యంతో చేతులు కలిపి ఎన్నికలు జరగకుండా చేసే ప్రయత్నాలు ఆయన ఖండించారు. కార్మికుల్లో నిరంతరం ఉంటూ సమస్యల సాధనలో కృషి చేస్తున్న ఏఐటీయూసీని ఆశీర్వదించాలన్నారు. నాయకులు వైవీరావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, రంగారావు, శ్రీనివాస్, రాంబాబు, ఓదెలు, అక్రం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణే ధ్యేయం

రామగిరి(మంథని): సింగరేణి కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యమని ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఏపీఏలో గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. టీబీజీకేఎస్ యాజమాన్యం తొత్తుగా మారి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఏఐటీయూసీ పనిచేస్తుందని కార్మికులు గమనించాలని కోరారు. నాయకులు వైవీ రావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీరెడ్డి, కందికట్ల సమ్మయ్య, గంగాధర్, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో రెండేళ్ల జైలు, జరిమానా

గోదావరిఖనిటౌన్(రామగుండం): సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకొని, ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బు అడిగితే చంపుతానని బెదిరించిన కేసులో నిందితుడికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష , రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గోదావరిఖని రెండో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ దుర్వ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తుమ్మల నారాయణరెడ్డి కుమారుడు విష్ణు చక్రధర్‌రెడ్డి బీటెక్ మధ్యలో మానేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈనేపథ్యంలో ఓసీపీ–1లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే సురేందర్ సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని 2015 నవంబర్ 18న నారాయణరెడ్డి నుంచి రూ.9లక్షలు తీసుకున్నాడు. కొన్నేళ్లు గడిచినా ఉద్యోగం పెట్టించలేదు. దీంతో డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే చంపుతానని నారాయణరెడ్డిని బెదిరించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి రెండో టౌన్ సీఐ దేవారెడ్డి కేసు నమోదు చేసి గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత రెండో టౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎలిగేటి మల్లేశం 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున గోదావరిఖని ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ వాదనలు వినిపించగా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో జడ్జి జైలు శిక్ష, జరిమానా విధించారు.